
సాక్షి
అనంతపురం

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.29,400

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.29,400 పలికాయి.



టమాట కిలో రూ.26

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.7°/ 19.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం కొంత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. వాయువ్య దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

8 మంది ఎస్సీల పింఛన్ల తొలగింపు

- టీడీపీకి ఓట్లేయలేదని కక్ష గట్టారని బాధితుల ఆవేదన



ఉరవకొండ: మండలంలోని నింబగల్లు సచివాలయ పరిధిలోని రేణుమాకుల పల్లి గ్రామంలో 8 మంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారి పింఛన్లు తొలగించారు. దీంతో శనివారం బాధితులు సచివాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీకి ఓట్లేయలేదనే కక్షతో తమ పింఛన్లు తొలగించారన్నారు. టీడీపీ నాయకుల కనుసన్నుల్లో అధికారులు అన్యాయపూరితంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. తమ గ్రామంలో ఎంతో మంది ధనికులు పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. అయినా వారిని పట్టించుకోని అధికారులు.. వెనుకబడిన వర్గాలు కావడంతో తమను టార్గెట్ చేశారని మండిపడ్డారు. దీనిపై ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి బల వెంకటేశులు టీడీపీ నాయకుల ఇళ్లలో కూర్చొని వారు చెప్పినట్లుగా ఉంటూ తమ కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ నెలకు సంబంధించిన పింఛన్ మంజూరు జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ డబ్బు ఇవ్వకుండా మధ్యాహ్నానికే వెళ్లిపోయారని వాపోయారు. టీడీపీ నాయకులు చెబితే ఇస్తానని, లేకుంటే ఇవ్వమని తెగేసి చెప్పారన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలసి అతనిపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కాగా, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బాల వెంకటేశులు వివరణ కోరగా.. పింఛన్ల మంజూరు లిస్టులో పేర్లుంటే ఇవ్వడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చి తొలగించామని చెప్పారు.

3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

అనంతపురం రూరల్: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల మూడో తేదీ ఉదయం పది గంటలకు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో అదనంగా ఏసీ కోచ్

గుంతకల్లు: నర్సాపూర్–ధర్మవరం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా 2 టైర్ ఏసీ కోచ్ జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్–ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (17247) ఎక్స్‌ప్రెస్ రైలుకు డిసెంబర్ 01వతేదీ నుంచి 31 వరకు జత చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ధర్మవరం–నర్సాపూర్ (17248) రైలుకు డిసెంబర్ 2 నుంచి జనవరి 1వతేదీ వరకు అదనంగా ఒక 2టైర్ ఏసీ కోచ్‌ను జత చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



‘అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం ... అవసరమైతే తగ్గిస్తాం’ అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు మాట తప్పారు. ప్రజలపై విద్యుత్ భారం మోపేందుకు సిద్ధమైపోయారు. ఈ నెల నుంచి 2026 నవంబర్ వరకు అంటే దాదాపు రెండేళ్ల కాలం పాటు ఇంధన సర్దుబాటు కింద వినియోగదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేయనున్నారు.

ముట్టుకుంటే షాక్

బాబు.. బాదుడే బాదుడు

- సర్దుబాటు పేరుతో భారీ వడ్డన
- నేటి నుంచి పెరగనున్న విద్యుత్ బిల్లులు
- ప్రజల ముక్కుపిండి రూ.1,117 కోట్లు రాబట్టనున్న ప్రభుత్వం
- యూనిట్‌పై 92 పైసల నుంచి రూ.1 పెంపు
- రెండేళ్ల పాటు తప్పని ‘ఇం’ధన’పు భారం

అనంతపురం టౌన్: గత ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి గెలిచిన చంద్రబాబు నేడు ప్రజలకు అసలైన బాదుడంటే ఏంటో చూపిస్తున్నారు. వినియోగదారులపై విద్యుత్ చార్జీల సర్దుబాటు భారం మోపేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇంధన చార్జీల కింద ప్రజల నుంచి వసూళ్లు చేసుకోవాలని డిస్కంలకు అనుమతిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఉత్తర్వులను జారీ చేసింది. రాయలసీమ జిల్లాలకు విద్యుత్ సరఫరా చేసే ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థకు రూ.1,117 కోట్ల మేర సర్దుబాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచే..

డిసెంబర్ 1 నుంచి ప్రజలపై విద్యుత్ చార్జీల మోత మోగనుంది. నవంబర్ నెలలో వాడిన విద్యుత్‌కు డిసెంబర్ 1 నుంచి వచ్చే విద్యుత్ బిల్లుకు పెరిగిన విద్యుత్ చార్జీలను జోడిస్తారు. ఇప్పటి వరకూ గృహావసర వినియోగదారులు యూనిట్‌కు రూ.1.26 పైసలు చొప్పున చెల్లించేవారు. ప్రస్తుతం సర్దుబాటు చార్జీల కింద అదనంగా 92 పైసల నుంచి రూ.1 పెంచే దిశగా విద్యుత్‌శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ లెక్కన సగటున ఒక యూనిట్‌పై రూ.2.20 పైసల పైగానే భారం పడనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా గృహావసర విద్యుత్ కనెక్షన్లు 13 లక్షలకు పైగానే ఉన్నాయి. రోజువారీ 30 లక్షల యూనిట్ల కరెంటును ప్రజలు వినియోగిస్తున్నారు. సగటున ఒక వినియోగదారుడు రోజుకు 2 నుంచి 3 యూనిట్ల మేర విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నారు. దీంతో పాటు చిన్న, మధ్య, పెద్ద పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో 10 వేలకు పైగానే ఉన్నాయి. ఇంధన సర్దుబాటు చార్జీలతో ఒక్కో వినియోగదారునిపై రోజుకు రూ.3 అనుకున్నా నెలకు రూ. 90 చొప్పున భారం పడనుంది. ఇది కూడా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వారికి మాత్రమే కావడం గమనార్హం. 200 యూనిట్ల పైన కరెంటు వాడుతున్న వారికి స్లాబ్ మారిపోతుంది.

రెండేళ్ల పాటు బాదుడు..

పెరిగిన విద్యుత్ చార్జీలను రెండేళ్ల పాటు అంటే 2026 నవంబర్ వరకు ఇంధన సర్దుబాటు ధరలను జోడించి వినియోగదారులకు బిల్లును అందించనున్నారు. జిల్లాలో దాదాపు రూ. 350 కోట్ల మేర ఇంధన సర్దుబాటు చార్జీలను డిస్కంలకు చెల్లించాల్సి ఉంది. డిస్కంలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయంటూ ఇలా వ్యవహరిస్తుండటం గమనార్హం. తాము అధికారంలోకి వస్తే ప్రజలపై భారం మోపబోమంటూ గతంలో చెప్పిన చంద్రబాబు నేడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంపై అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

వచ్చే నెల నుంచి అమలు..



ఇంధన సర్దుబాటు చార్జీలను విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని డిస్కంలకు ఏపీఈఆర్‌సీ సూచించింది. ఈ మేరకు ఈ నెల నుంచే విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేస్తాం. నవంబర్‌లో వినియోగించిన కరెంటుకు అందించే బిల్లుకే పెరిగిన ధరలను జోడించనున్నాం.

– సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ

ప్రజలపై భారం మోపడం దుర్మార్గం



నిరసన తెలుపుతున్న సీపీఎం కార్యదర్శి రాంభూపాల్, నాయకులు

అనంతపురం అర్బన్: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన మాట తప్పి సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.9,412 కోట్ల భారం మోపడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శనివారం స్థానిక టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా ఇంత పెద్ద మొత్తంలో భారం వేయడం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. గత నెలలో రూ.600 కోట్లకు పైగా భారం మోపారన్నారు. ఇప్పుడు మరో రూ.12,844 కోట్ల భారం మోపేందుకు డిస్కమ్‌లు ప్రతిపాదించగా రూ.9,412 కోట్లు భారం వేసేందుకు అంగీకరించామని ఈఆర్‌సీ కార్యదర్శి పి.కృష్ణ చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అదానీపై అమెరికా కోర్టులో కేసు నమోదైనప్పటికీ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ ద్వారా 6,200 మెగావాట్ల విద్యుత్‌ను ఎనిమిది జిల్లాల్లో అదానీ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. ఈ విద్యుత్‌ను యూనిట్ రూ.2.49 చొప్పున కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై వేయడమేంటని ప్రశ్నించారు. నిత్యావసర సరుకుల ధరలు, విద్యా, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిన ఈ పరిస్థితుల్లో విద్యుత్ భారం మోపడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం ఒకటో నగర కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, ముత్తూజ, గోపాల్, వలి తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖలో కోల్డ్ వార్!

- అధికారిపై పెత్తనానికి దిగువస్థాయి అధికారి యత్నాలు
- ప్రజాప్రతినిధి ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిడి
- విధుల్లో సహకరించకుండా కీలక సమయాల్లో సెలవులు
- ఇక్కడి వ్యవహారాలు, తీరుపై కలెక్టర్ సీరియస్

అనంతపురం అర్బన్: పౌర సరఫరాల శాఖ అధికారుల మధ్య కోల్డ్‌వార్ పరాకాష్టకు చేరింది. డీఎస్‌ఓ (జిల్లా పౌర సరఫరాల అధికారి), శాఖ సిబ్బందిపై పెత్తనం చెలాయించడంతో పాటు డీఎస్‌ఓని జిల్లా నుంచి సాగనంపేందుకు దిగువ స్థాయి అధికారి ఒకరు తెరవెనక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. కొన్ని రోజుల క్రితం ఆ ప్రజాప్రతినిధి అనుచరుడు ఒకరు ఉన్నతాధికారులను కలిసి ఈ విషయం మాట్లాడినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా విధి నిర్వహణలోనూ డీఎస్‌ఓకు ఆ అధికారి సహకరించకుండా కీలక సమయాల్లో సెలవులు పెడుతున్నట్లు ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడి వ్యవహారాలు, అధికారుల తీరు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో ఆయన సీరియస్ అయినట్లు తెలిసింది.



జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం

పనిపై కంటే పెత్తనంపై దృష్టి

పౌర సరఫరాల శాఖలో డీఎస్‌ఓ, ఏఎస్‌ఓలు, సీఎస్‌డీటీల పాత్ర కీలకం. అయితే ఇక్కడ కొందరు దిగువస్థాయి అధికారులు పనిపై కంటే పెత్తనంపై దృష్టి పెట్టడంతో వ్యవహారం ముదిరిపాకాన పడింది. రెగ్యులర్ డీఎస్‌ఓగా వెంకటేశ్వర్లను ఈ ఏడాది జూన్‌లో నియమించిన ప్రభుత్వం.. తర్వాత రెండు రోజుల వ్యవధిలోనే డిప్యుటేషన్‌పై అల్లూరి జిల్లాకు పంపించింది. కొన్ని రోజుల్లోనే మళ్లీ డిప్యుటేషన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో అప్పటి వరకు అన్నీతానై శాఖను నడిపించిన దిగువస్థాయి అధికారి దీన్ని జీర్ణించుకోలేకపోయారు. డీఎస్‌ఓకి వ్యతిరేకంగా పనిచేయడం మొదలుపెట్టినట్లు ఆ శాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పౌర సరఫరాల శాఖ ద్వారా అమలయ్యే ప్రభుత్వ పథకాలను ప్రారంభించే కీలక సమయాల్లో చిన్నపాటి ఆరోగ్య సమస్యలు చూపుతూ సెలవు పెడుతున్నట్లు తెలిసింది. అంతే కాకుండా తాను కోరుకున్న చోట పనిచేసేలా వీలు కల్పించాలంటూ అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయించినట్లు సమాచారం.

కలెక్టర్ దృష్టికి వ్యవహారం

పౌరసరఫరాల శాఖలో చోటు చేసుకున్న వ్యవహారాలు కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది. దిగువస్థాయి అధికారి ఏ విధంగా ఇబ్బంది పెడుతున్నారు... కీలక సందర్భాల్లో (తేదీలతో సహా) ఎప్పుడెప్పుడు సెలవు పెట్టారు... ఇందుకు చూపిన ఆరోగ్య సమస్య తదితర వివరాలతో పెద్ద ఫైలు సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపినట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం



పౌరసరఫరాల శాఖ వ్యవహారాలు నా దృష్టికి వచ్చాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలి. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. అధికారులు ఏస్థాయి వారైనా వారు నియమితులైన స్థానాల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. ఇదే విషయంపై జాయింట్ కలెక్టర్‌కు కచ్చితమైన ఆదేశాలిచ్చా.

– కలెక్టర్ వి.వినోద్‌కుమార్

విత్తన పంపిణీ మాయాజాలం

- జిల్లాకు 27,907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాల కేటాయింపు
- అందులో రైతులకు పంపిణీ చేసింది 10 వేల క్వింటాళ్లే
- ‘రబీ’ విత్తనకాయల్లోనూ ఇదే తీరు

అనంతపురం అగ్రికల్చర్: ఉత్తుత్తి కేటాయింపులతో చంద్రబాబు సర్కారు రైతులను ఊరిస్తుండగా.. అందుకు తగ్గట్లుగానే జిల్లా వ్యవసాయశాఖ పనిచేస్తోంది. విత్తన పంపిణీ విషయానికి వస్తే ఆ శాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రధాన పంటల సాగు విస్తీర్ణం తగ్గిన విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలో 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు 27,907 క్వింటాళ్లు అందిస్తామని ఘనంగా ప్రకటించారు. అయితే వర్షాలు వచ్చిన ఆగస్టులో కాకుండా సీజన్ ముగుస్తున్న సెప్టెంబర్‌లో పంపిణీ మొదలు పెట్టడంతో రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. రైతులకు కేవలం 10 వేల క్వింటాళ్లే పంపిణీ చేసి ముగించారు. ఇక రబీలో 27,139 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ కేటాయించినా, 21 వేల క్వింటాళ్లే పంపిణీ చేసి మిగతా 6 వేల క్వింటాళ్లు మిగిలించారు. కేవలం 25 శాతం రాయితీ వర్తింపజేయడంతో విత్తనాలు తీసుకునేందుకు చాలా మంది రైతులు ఆసక్తి చూపలేదు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 40 శాతం విత్తన రాయితీ ఇవ్వడంతో పూర్తి స్థాయిలో రైతులు తీసుకున్నారు.



రైతుల అసంతృప్తి..

కూటమి సర్కారుకు వంత పాడుతూ నష్టం కలిగిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారుల తీరుపై రైతులు పెదవి విరుస్తున్నారు. కరువు మండలాల జాబితాను బాగా కుదించి భవిష్యత్తులో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా చేయడంలో కూడా ఇప్పటికే తమ వంతు పాత్ర పోషించినట్లు ఆరోపణలున్నాయి. కంది మినహా పంటలన్నీ దాదాపు పూర్తయిన తర్వాత పొలం పిలుస్తోంది అంటూ ఇటీవల ప్రతి మంగళ, బుధవారాల్లో హడావిడి చేస్తున్నా.. అందులో పాల్గొనేందుకు రైతులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎలాగోలా ఐదారుగురు రైతులను రప్పించి ఫొటోలకు పోజులిచ్చి మమ అనిపించేస్తున్నట్లు చెబుతున్నారు.

బాబు నోట.. మళ్లీ పాత పాటే!



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



భోజన ప్యాకెట్ల కోసం పోలీసుల పాట్లు

రాయదుర్గం: బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లులో శనివారం పర్యటించిన సీఎం చంద్రబాబు మళ్లీ పాత హామీలతోనే సరిపెట్టేశారు. ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేశారు. హంద్రీనీవా ద్వారా జీడిపల్లికి చేరే కృష్ణా జలాలతో బీటీపీని నింపుతామని 2017లో గుమ్మఘట్ట మండలం పూలకుంట వద్ద, 2018లో బీటీ ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన సభల్లో ఇచ్చిన హామీనే మళ్లీ నేమకల్లులోనూ చంద్రబాబు వల్లెవేశారు. ఉంతకల్లు రిజర్వాయర్ మంజూరు చేస్తానంటూ మమ అనిపించేశారు. ఎన్ని నిధులు కేటాయిస్తారు? ఎప్పటిలోపు పూర్తి చేస్తారు? తదితర వివరాలేవీ చెప్పకపోవడంతో ఇది ఇప్పట్లో సాధ్యమౌతుందా? అని స్థానికులు సందేహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా ద్వారా 36వ ప్యాకేజీ పనులు చేయిస్తామని గతంలో తానన్న మాటలనే మరోమారు చెప్పారు.గతంలో మాల్యం–ఆవులదట్ల బ్రాంచ్ కెనాల్ నిర్మిస్తామని, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 20 వేల ఎకరాల్లో ఇసుక మేటల నివారణకు కృషి చేస్తామని చెప్పిన ఆయన.. ఆ తర్వాత పైసా నిధులు విదల్చకపోయారు. మళ్లీ నేడు అవే హామీలు ఇవ్వడంతో ప్రజలు మండిపడ్డారు. 2014–19 మధ్య వేదావతి నదిలో సబ్‌సర్ఫేస్ డ్యాంల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి వదిలేశారని, మళ్లీ ఇప్పుడు అదే మాట చెప్పారని విమర్శించారు. బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మధ్య స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సరైన మార్గం చూపలేకపోయిన చంద్రబాబు.. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా తయారుచేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం గమనార్హం.

‘సూపర్ సిక్స్’పై స్పష్టత కరువు

సూపర్‌సిక్స్ హామీలపై నేమకల్లు సభలోనూ సీఎం చంద్రబాబు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో జిల్లా ప్రజలు నిరాశ చెందారు. బెల్టుషాపులు పెడితే బెల్టు తీస్తానని ఆయన చెప్పడంపై ప్రజలు నవ్వుకున్నారు.

తమ్ముళ్ల నిరాశ..

చంద్రబాబు నేమకల్లు పర్యటన తెలుగు తమ్ముళ్లను తీవ్ర నిరాశకు గురిచేసింది. అధినేతను కలవడానికి అవకాశం దొరక్కపోవడంతో టీడీపీకి చెందిన ముఖ్య నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలోనే ఆయనకు కార్యకర్తలు గుర్తుకువస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సరైన భోజనం సౌకర్యం కల్పించకపోవడంతో పోలీసు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాక్టర్‌లో వచ్చిన భోజనం తీసుకునేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు.

భక్తుల ఆవేదన..

ముఖ్యమంత్రి పర్యటన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నేమకల్లు క్రాస్, హీరేహాళ్, డీ.హీరేహాళ్ గ్రామాలకు వెళ్లే రోడ్లను పోలీసులు మూసేశారు. కార్తీక మాసం చివరి శనివారం కావడంతో నేమకల్లు ఆంజనేయ స్వామి దర్శనానికి కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులను పోలీసులు అడ్డుకోవడంతో ఆవేదన చెందారు.

నేమకల్లు–ఉంతకల్లు మధ్య రిజర్వాయర్

నేమకల్లు–ఉంతకల్లు గ్రామాల మధ్య నీటి నిల్వకు రిజర్వాయర్ మంజూరు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. నేమకల్లులో 112 మందికి ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. మినీ గోకులాలు ఎన్ని కావాలన్నా ఇస్తామన్నారు. జీడిపల్లి–భైరవానితిప్ప ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామన్నారు. రాయదుర్గం మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకుంటామని, నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీరందిస్తామన్నారు. వేదావతి హగరి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట చెరువుకు తుంగభద్ర హెచ్చెల్సీ ద్వారా నీరిస్తామన్నారు. నేమకల్లు ఆంజనేయస్వామి గోపురానికి రూ. 3 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ ప్రాంతానికి రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు చేస్తున్నామన్నారు. నేమకల్లును ఆదర్శ గ్రామంగా తయారు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, సెర్ప్ సీఈఓ వీర పాండ్యన్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుబాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, జేసీ అస్మిత్‌రెడ్డి, గుమ్మనూరు జయరామ్, బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకట ప్రసాద్, ఆర్డీఓ వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.



పరవశభరితం.. సత్యసాయి అవతార వైభవం

ప్రశాంతి నిలయం: సత్యసాయి లీలలను ప్రదర్శిస్తూ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను పరవశభరితం చేశాయి. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హైదరాబాద్ సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి అవతార వైభవం పేరుతో నృత్య నాటికను ప్రదర్శించారు. సత్యసాయి బోధనలు, సేవా కార్యక్రమాలను చక్కగా వివరించారు.



సత్యసాయి అవతార వైభవం నృత్య నాటికలోని ఘట్టాలు

క్లుప్తంగా

ఎరువుల దుకాణాలపై దాడులు

కళ్యాణదుర్గం: జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం సీఐ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్ కుమార్, ఏడీఏ యల్లప్ప సంయుక్తంగా పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఓం సాయి ట్రేడర్స్ పెస్టిసైడ్ దుకాణంలో కాలం చెల్లిన 5 రకాల పురుగుల మందులను గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణంలో ఉండటం చట్టరీత్యానేరమన్నారు. రూ.53,679 విలువ చేసే 27.50 లీటర్ల పురుగు మందును సీజ్ చేశారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు నసీమా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పదోవార్డు గాంధీ స్కూల్ ఏరియాలో నివాసముంటున్న నసీమా (28) అనే వివాహిత శనివారం ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మొబైల్‌షాపు నిర్వాహకుడు జి.మొహమ్మద్ ముజీబ్, నసీమా దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కొంతకాలంగా నసీమా అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికితోడు తరచుగా దంపతులు గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన నసీమా శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. విషయం తెలుసుకున్న భర్త హుటాహుటిన ఇంటికి చేరుకుని ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూ సమస్యపై ఇరువర్గాల దాడి

గార్లదిన్నె: యర్రగుంట్లలో భూ సమస్యపై ఇరువర్గాలు రాళ్లతో దాడులు చేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన ఖాసీం, ఖాదర్ బాషాకు మరో వర్గానికి చెందిన గంపమల్లయ్య, మాధవయ్య మధ్య భూవివాదం ఉంది. శనివారం ఉదయం పొలం వద్ద ఇరువర్గాల వారు భూ సమస్యపై వాదులాడుకున్నారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో గాయపడిన నలుగురు వ్యక్తులు అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఖాసీం, ఖాదర్ బాషాలపై ఎస్సీ, ఎస్టీ కేసు, గంపమల్లయ్య, మాధవయ్యలపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

గుడిబండ: మండలంలోని గుడిబండ, సింగేపల్లి తదితర గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం గుడిబండ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా రాత్రీ పగలు తేడా లేకుండా హేమావతి గ్రామానికి అనుమతి ఇసుక రవాణా చేస్తున్నారన్నారు.

ప్రభాకర్‌రెడ్డీ.. పద్ధతి మార్చుకో

- విమర్శలను హుందాగా స్వీకరించాలి
- దిగజారి మాట్లాడడం సబబు కాదు
- అనంతకు తక్షణం క్షమాపణ చెప్పాలి
- నగరపాలక సంస్థ మేయర్ వసీం డిమాండ్




మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు

అనంతపురం కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలని నగరపాలక సంస్థ మేయర్ వసీం హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేసి, ప్రజలకు మేలు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచిస్తే.. దాన్ని జీర్ణించుకోలేక వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లతో కలసి మేయర్ మీడియాతో మాట్లాడారు. అనంతపై ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రజా సమస్యలపై ఎవరూ నోరెత్తకుండా ఉండేలా ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించడం రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనకు దర్పణం పడుతోందన్నారు. అనంత నాలుగుసార్లు ఎంపీ, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారని, అవినీతి, దౌర్జన్యాలకు ఆస్కారం లేకుండా సేవలందించారని గుర్తు చేశారు. జిల్లాకు హంద్రీ-నీవా నీళ్లు, అనంతపురం నగరానికి మరో 40 ఏళ్ల పాటు నీటి సమస్య లేకుండా ప్రత్యేక పైప్ లైన్ వేయించారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలో రూ.1050 కోట్ల అభివృద్ధికి సహకరించి ప్రజల మెప్పు పొందారని కొనియాడారు.

ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యాలు అందరికీ తెలుసు

తాడిపత్రిలో దౌర్జన్యాలు చేసి మీరు ఏవిధంగా గెలుస్తున్నారో ప్రజలకందరికీ తెలుసని మేయర్ పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై వంద కేసులు ఉంటాయని, కానీ అనంత వెంకటరామిరెడ్డిపై ఒక్క కేసు కూడా లేదని తెలిపారు. బయోమైనింగ్ ప్రాజెక్టుపై, తాను మేయర్‌గా ఎన్నికైనందుకు రూ.5 కోట్లు ఇచ్చానని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారన్నారు. వాస్తవానికి ఆ పనులు చేసింది హైదరాబాద్ సంస్థ అని, ఇప్పటి వరకు సదరు సంస్థకు రూ.10 కోట్లు నగరపాలక సంస్థ చెల్లించిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది వారి ప్రభుత్వమేనని, వీలైతే విచారణ చేసుకోవాలని సూచించారు. రూ.5 కోట్లు ఎలా ఇచ్చానో సమాధానం చెప్పాలన్నారు. నగరంలోని ఐటీఐ స్థలం కబ్జా కాకుండా కాపాడింది అనంత వెంకటరామిరెడ్డి అని అన్నారు. ప్రభాకర్‌రెడ్డి బెదిరింపులకు భయపడబోమన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట తీరు చూశాక యువత రాజకీయాల్లోకి రావాలంటే ఆలోచించే పరిస్థితి వచ్చిందన్నారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, అభివృద్ధి కోసం అనంత సామరస్య రాజకీయాలు చేస్తున్నారని, ఆ వాతావరణాన్ని చెడగొట్టే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు. కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, నరసింహులు మాట్లాడుతూ అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడిన ప్రతి మాటా వాస్తవమని, అందుకే టీడీపీ నాయకులు స్పందించలేదని పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యం చేస్తామంటే సహించబోమని, అవసరమైతే 50 వేల మందితో తాము కూడా తాడిపత్రికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. తక్షణమే అనంతకు ప్రభాకర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్, రమణ, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, చంద్రలేఖ, లావణ్య, హసీనా బేగం, రామాంజనమ్మ, కో ఆప్షన్ సభ్యులు మారతమ్మ, ఉమామహేశ్వరి, షంషుద్దీన్, నాయకులు కొర్రపాడు హుస్సేన్ పీరా, రామచంద్ర, సుబ్బయ్య, కుళ్లాయస్వామి, దాదాఖలందర్, చింతకుంట మధు, శోభాబాయి, శోభారాణి, కృష్ణవేణి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిది పశుభాష


కేవీ రమణ

అనంతపురం ఎడ్యుకేషన్: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై వచ్చిన విమర్శలకు హుందాగా సమాధానమివ్వకుండా విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట తీరు పశుభాషను తలపిస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీపీపీ నుంచి బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఇటు జేసీ ప్రభాకర్‌రెడ్డి పోటీపడి ఫ్లయాష్ తరలించుకుపోవడం సరైంది కాదంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి చేసిన విమర్శలపై సరైన సమాధానం చెప్పలేక ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిగత దాడికి దిగుతున్నారని పేర్కొన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడడం అప్రజాస్వామికం అని ఖండించారు. ఓ వైపు అనంత తల్లి తనకు అక్క అవుతుందని చెబుతూనే పరుష పదజాలంతో దూషించడాన్ని తప్పు పట్టారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మొదటి నుంచి ఎదుటివారిని ఇదే భాషలో మాట్లాడటం పరిపాటిగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన మొదటి రోజునే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఇష్టానుసారం తిట్టారని, మద్యం షాపులు దక్కించుకున్న వారు కచ్చితంగా తనకు కమీషన్ ఇవ్వాల్సిందేనని బహిరంగంగా డిమాండ్ చేశారని, అయినా ఏ వ్యవస్థా స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు.


ఆలయ ప్రాంగణంలో దీపాలు పెడుతున్న మహిళలు

కరుణించు.. ఖాద్రీశా..!

కదిరి టౌన్: లక్ష్మీనారసింహస్వామి నామస్మరణతో ఆలయం ప్రతిధ్వనించింది. శనివారం ఖాద్రీశుని ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బ్యాటరీ దొంగల హల్‌చల్

- ట్రాక్టర్లకు అమర్చిన బ్యాటరీలే టార్గెట్


బ్యాటరీలు చోరీ అయిన ట్రాక్టర్లు


బ్యాటరీని స్కూటీలో ఎత్తుకెళ్తున్న దొంగలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి, కొడిమి పంచాయతీల్లో బ్యాటరీ దొంగలు హల్‌చల్ చేశారు. ఇటీవల ట్రాక్టర్లను టార్గెట్ చేసి బ్యాటరీలను ఎత్తుకెళ్లడం కలకలం రేపుతోంది. రాచానపల్లి పంచాయతీ కార్యాలయానికి చెందిన ట్రాక్టర్ బ్యాటరీలను ఇటీవల రెండుసార్లు అపహరించుకుపోయారు. తాజాగా శనివారం రాచానపల్లికి చెందిన చెన్నారెడ్డికి సంబంధించిన రెండు ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. పట్టపగలే ఈ ఘటనలు చోటు చేసుకోవడం భయాభ్రాంతులకు గురి చేస్తోంది. చెన్నారెడ్డి ఇంటికి వంద అడుగుల దూరంలో రెండు ట్రాక్టర్లను ఉంచారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు యువకులు స్కూటీలో వచ్చి సెకన్లలో వైర్లు తొలగించి బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. వారు బ్యాటరీ పెట్టుకుని వెళ్తున్న దృశ్యాలు స్థానికంగా సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఇటీవల కొడిమిలోనూ నాలుగు ట్రాక్టర్ల బ్యాటరీలు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు దృష్టి సారించి దొంగతనాలకు చెక్ పెట్టేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక


లోకనాథ్

యాడికి: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా పూతలపట్టులో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 14 త్రోబాల్ పోటీల్లో యాడికి మండలం కోనుప్పలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.లోకనాథ్ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం పెద్దన్న తెలిపారు. విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

యువతకు ప్రధానితో మాట్లాడే అవకాశం

అనంతపురం కల్చరల్: యువత రాజకీయాల్లో రాణించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వీక్షిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువకేంద్ర (ఎన్‌వైకే) అధికారులు మణికంఠ, శ్రీనివాసులు సూచించారు. శనివారం అనంతపురంలోని ఎన్‌వైకే కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' అనే కార్యక్రమంలో జనవరి 11, 12 తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడే అవకాశం ప్రతిభావంతులైన యువతకు కల్పిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే గత నెల 25 నుంచి ఈనెల 5 వరకు 'వీక్షిత్ భారత్' క్విజ్ ప్రోగ్రాం మేరా యువ భారత్ ప్లాట్‌ఫాం ద్వారా సాగుతోందన్నారు. ఇప్పటికీ దీనిని యువతీ యువకులు వినియోగించుకోవడానికి, మరిన్ని వివరాలకు httpr://mybharat.gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

'హెలిప్యాడ్' హెల్పర్‌కు పాముకాటు


చికిత్స పొందుతున్న షర్మస్

బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా నేమకల్లులో హెలిప్యాడ్ పనులు చేసేందుకు వచ్చిన హెల్పర్ షర్మస్ పాముకాటుకు గురయ్యాడు. శుక్రవారం రాత్రి హెలిప్యాడ్ పనులు ముగించి అక్కడే స్టేజీ వద్ద నిద్రించాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో షర్మస్ కుడి కాలు, తొడకు భాగంలో పాము కాటు వేసింది. వెంటనే తోటిహెల్పర్లకు తెలపడంతో వారు అతడిని బళ్లారి విమ్స్ తరలించారు. విషయం తెలిసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని షర్మస్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

లారీ ఢీకొని పాదచారి మృతి

మడకశిర రూరల్: మండలంలోని యు.రంగాపురం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాదచారి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జక్కేపల్లికి చెందిన లక్ష్మీనరసప్ప (58) యు.రంగాపురం హైవేపై నడుచుకుంటూ స్వగ్రామానికి వస్తుండగా మధుగిరి వైపు నుంచి మడకశిర వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని మడకశిరలో ప్రజలు అడ్డగించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

శిక్షణ పొందిన కళాశాలకే ప్రిన్సిపాల్ కావడం గర్వకారణం


పీటీసీ ప్రిన్సిపాల్ రఘువీరారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఐజీ వెంకట్రామిరెడ్డి

అనంతపురం సెంట్రల్: శిక్షణ తీసుకున్న కళాశాలకు ప్రిన్సిపాల్ కావడం గర్వకారణమని పీటీసీ ప్రిన్సిపాల్ కె.రఘువీరారెడ్డిని పోలీసుశాఖ ఐజీ(ట్రెనింగ్) వెంకట్రామిరెడ్డి అభినందించారు. ఉద్యోగ విరమణకు ఒకరోజు ముందు ఆయనను పీటీసీ ప్రిన్సిపాల్‌గా నియమించిన విషయం విదితమే. శనివారం పీటీసీ ప్రిన్సిపాల్ కె.రఘువీరారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ దంపతులను ఐజీ సత్కరించారు. సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖకు రఘువీరారెడ్డి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీటీసీ డీఎస్పీలు హరినాథరెడ్డి, అల్లాబకాష్, ఏఆర్ డీఎస్పీ కోటిరెడ్డి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంలో తిరగబడ్డ ట్రాక్టర్

- రైతు దుర్మరణం
- భార్య కళ్లెదుటే ఘోరం


రోదిస్తున్న భార్య లక్ష్మమ్మ, కుటుంబ సభ్యులు


మోతీరామ్‌నాయక్ (ఫైల్)

రొళ్ల: రబీ సీజన్‌లో వరి సాగు చేయాలనుకున్నాడు. పొలం చదును చేస్తున్న క్రమంలో ట్రాక్టర్ తిరగబడింది. ట్రాక్టర్ కింద బురదలో ఇరుక్కుని రైతు దుర్మరణం చెందాడు. కళ్లెదుట జరిగిన ఈ ఘోరాన్ని భార్య జీర్ణించుకోలేకపోయింది. ఆమె రోదన అందరినీ కలచివేసింది. వివరాల్లోకెళితే... ఆవినకుంట తండాకు చెందిన మోతీరామ్‌నాయక్ (55), లక్ష్మమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వరి సాగుకు పొలం సిద్ధం చేసేందుకు శనివారం భార్యతో కలిసి మినీ ట్రాక్టర్‌లో వెళ్లాడు. అక్కడ రోటావేటర్‌తో దుక్కిచేస్తున్నాడు. అలా అరగంట చేసిన తర్వాత ఎగుడుదిగుడు ప్రదేశంలో ట్రాక్టర్ ఒరిగి ఇరుక్కుపోయింది. బయటకు తీసేందుకు వెనక్కు ముందుకు కదిలిస్తుండగా ట్రాక్టర్ ఎడమవైపు బోల్తాపడింది. డ్రైవింగ్ చేస్తున్న మోతీరామ్‌నాయక్ బురదలో ఇరుక్కుని విలవిలలాడాడు. భార్య గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లోని రైతులు, మేకల కాపర్లు పరుగున వచ్చి ట్రాక్టర్‌ను పైకెత్తారు. మోతీరామ్‌నాయక్‌ను బయటకు తీయగా.. అప్పటికే అతను ప్రాణం విడిచాడు. దేవుడా ఎంత పనిచేశావయ్యా అంటూ భార్య విలపించింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ రొళ్ల, గుడిబండ మండలాల కన్వీనర్లు నరసింహారెడ్డి, డీఎల్ యంజారేగౌడు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సంఘటన స్థలాన్ని జమేదార్ రమణ, కానిస్టేబుల్ షఫీ పరిశీలించారు. మృతుని భార్య లక్ష్మమ్మ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మడకశిర ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం స్వగ్రామం ఆవినకుంటతండాలోని పొలంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మోతీరామ్‌నాయక్ రొళ్ల సింగిల్ విండో అధ్యక్షుడిగా 2020 నుంచి 2024 జూన్ 5 వరకు పనిచేశారు.

సూపర్ సిక్స్ అమలులో బాబు విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు

కళ్యాణదుర్గం: సూపర్ సిక్స్ పథకాల అమలులో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ విమర్శించారు. కళ్యాణదుర్గంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ సంజీవప్ప, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మల్లికార్జున, తాలూకా కార్యదర్శి గోపాల్ మీడియాతో కలిసి జాఫర్ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలంటూ ఊరూరా ఊదరగొట్టారన్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఆ పథకాలపై దృష్టి సారించలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టు నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో ఉన్న క్వారీలు, ఇతర ఫ్యాక్టరీలతో వచ్చే కాలుష్యం, పొగ కారణంగా దాదాపు 900 ఎకరాల్లో పంటలు పండించే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి రైతులను ఆదుకోవాలన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బీటీపీ ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాం నుంచి భూసేకరణ తప్ప మరో అడుగు ముందుకు పడలేదన్నారు. ఇప్పటికీ భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయన్నారు. ఓ వైపు సీఎం చంద్రబాబు బెల్టుషాపులు పెడితే బెల్టు తీస్తామని చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల నేతల అండతోనే బెల్టుషాపులు నడుస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టంచేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు నరసింహులు, బీకే గోపాల్, రామకృష్ణ, ఆంజినేయులు, నాగరాజు నాయక్, ఓంకార్, మహిళా నాయకురాలు కవిత, ఈరన్నలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్‌కు ఉత్తమ అవార్డు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్ ఉత్తమ సేవా కేంద్రంగా ఎంపికైంది. ఈ మేరకు శనివారం ఏపీ సాక్స్ నుంచి సమాచారం అందింది. 2020 సంవత్సరంలో కూడా ఈ అవార్డు లభించింది. ఈ ఏడాది ఏఆర్‌టీ సెంటర్ ద్వారా 378 కేసులకు చికిత్సలు అందించినట్లు సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో 48 మంది గర్భిణులు, 111 మంది క్షయ వ్యాధిగ్రస్తులు, 156 మంది హెపటైటిస్ వ్యాధిగ్రస్తులు, ఐదుగురు హెపటైటిస్- సీ వారు వైద్యం అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు డాక్టర్ సత్యనారాయణ, తదితరులను అభినందించారు.

18 నుంచి సెమిస్టర్

అనంతపురం సెంట్రల్: శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో మొదటి సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 18 నుంచి 28 వరకూ జరుగుతాయని పరీక్ష విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు మెగా సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

జనసేన నేత ఇసుక దందా

- ట్రాక్టరును అడ్డుకున్న గ్రామస్తులు
- పోలీసులకు అప్పగింత


పోలీసుల ఆధీనంలో ఉన్న ఇసుక ట్రాక్టర్.. చిత్రంలో జనసేన నేత సురేష్

పరిగి: పరిగి మండల జనసేన పార్టీ కన్వీనర్ చిన్నపల్లి సురేష్ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడ్డాడు. శనివారం మండలంలోని పైడేటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపంలోని పెన్నానదిలో ఇసుకను తవ్వి, ట్రాక్టరులో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డగించారు. సురేష్ తరచూ ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ఆగ్రహించి..మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) సిద్దేశ్వర్ అక్కడికి చేరుకుని ఇసుక ట్రాక్టర్‌ను పరిగికి తరలించి, పోలీసులకు అప్పగించారు. కాగా.. పరిగి ఎస్ఐ రంగడు యాదవ్ అందుబాటులో లేని కారణంగా ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేయలేదని ఏఎస్ఐ జయలత తెలిపారు.

క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురం సెంట్రల్: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్‌బాబు తెలిపారు. గత వారం చెన్నైకి చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ వస్తు తయారీ సంస్థ అభిరామి ఇంజినీరింగ్ వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూల్లో ఈఈఈ చదువుతున్న వసీం అక్బర్, జస్వంత్ కుమార్, సతీష్ బాబు, రాజేష్, శ్రీకాంత విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. సదరు సంస్థ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో సేవలందిస్తోందని తెలిపారు. అలాంటి కంపెనీకి కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మెన్ పల్లె కిషోర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఈఈఈ విభాగాధిపతి మహేస్, ఏఓ మనోహర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు అభినందించారు.

కనకదాస సేవలు అమూల్యం



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం సెంట్రల్: కనదాస రచించిన కీర్తనలు, పద్యాలు బడుగు బలహీన వర్గాలను చైతన్యపరిచాయి. ఆయన అందించిన సేవలు మరువలేనివని ఎస్కేయూ వైస్ చాన్సలర్ బి.అనిత కొనియాడారు. శనివారం యూనివర్సిటీలోని పూలే భవనంలో కనకదాస జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ఆచార్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం



విద్యార్థులతో ఎన్‌సీసీ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సీనియర్ డివిజన్ (బాయ్స్), సీనియర్ వింగ్ (బాలికలు) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎన్‌సీసీ డే–2024 వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా 6వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎల్డీ రోడ్రిగ్స్ హాజరయ్యారు. ఎన్‌సీసీ క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ ఏకగ్రతా, సమగ్రతను కాపాడటం, క్రమశిక్షణ, ఎన్‌సీసీ ద్వారా సమాజ సేవ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రత్యేక అతిథిగా కర్ణాటక కలబురిగి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటకలో వాణిజ్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ లెఫ్టినెంట్ డాక్టర్ జి.రంగనాథం పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో మాజీ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా తన అనుభవాలు, సందేశాన్ని అందించారు. రెండు ఎన్‌సీసీ యూనిట్ల చీఫ్ ట్రైనింగ్ ఆఫీసర్లు డాక్టర్ ఎం.రామాంజనేయులు, జి.చిన్నవెంకటమ్మ విద్యార్థులకు ఎన్‌సీసీ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.పద్మ, అధ్యాపకులు డాక్టర్ ఇ.అహ్మద్, డాక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రాప్తాడులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం రాప్తాడులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. పాడి రైతుల కోసం గోకుల షెడ్లను మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో మొదటిసారిగా రాప్తాడులో గోకులం షెడ్డును ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, ఏపీఓ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం



- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- విలవిల్లాడుతున్న ప్రజలు

రాప్తాడు: మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతుండటంతో సాధారణ ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఈ రోజు కిలో రూ.40 ఉన్న రేటు మార్నాటికల్ల రూ.50, రూ.60 అని వ్యాపారులు చెబుతుంటే అవాక్కవడం మనవంతు అవుతుంది. ఉల్లి, వంకాయలు, బీర, అనప, వెల్లుల్లి, బెండ, దొండ, క్యాలీఫ్లవర్, బంగాళాదుంపలు, కాకరకాయలు ఇలా అన్ని కూరగాయల అధికంగానే ఉన్నాయి. కార్తీక మాసం, మాలధారులు పీఠాలు ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తూ పూర్తి శాఖహారమే తీసుకోవడం, అన్నసమారాధనల నేపథ్యంలో కూరగాయల వినియోగం అధికమైంది. కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొత్తిమీర నుంచి ఉల్లిపాయల వరకు ఏ ఒక్కటీ అందుబాటు ధరల్లో లేకపోవడంతో కొనలేక పోతున్నారు. రూ.500 తీసుకని మార్కెట్‌కు వెళ్తే కనీసం సగం సంచి కూడా నిండటం లేదని ఆవేదన చెందుతున్నారు. అనంతపురం నగరం, ఇతర ప్రాంతాల్లో అయితే కనీసం కంటితుడుపు చర్యగా రైతు బజార్లు అయినా ఉన్నాయి. రాప్తాడు మండలంలో ఒక్క రైతు బజార్ కూడా లేకపోవడంతో ధరల దరువు నడుమే ప్రజలు కూరగాయాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జూలై, ఆగస్టు నెలల్లో కూరగాయల ధరలు పెరగడం మామూలే. అయినప్పటికీ ఈ ఏడాది మరీ ఇంత దారుణంగా పెరగడంతో కొనుక్కొని తినే పరిస్థితులు లేవని వినియోగదారులు వాపోతున్నారు.

కిలో రూ.30 పైమాటే..

రాప్తాడులో ఏ రకం కూరగాయల ధరలు చూసినా కిలో రూ.30కి పైనే పలుకుతున్నాయి. బయటి మార్కెట్, దుకాణాల్లో రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు. రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల్లో గత కొద్ది రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా కూరగాయల కొరత ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి, పలు రకాల కూరగాయలు అవసరమైన స్థాయిలో సరఫరా కావడం లేదు. దీంతో కూరగాయలు దొరకని పరిస్థితి నెలకొంది.

ఈ వారం రాప్తాడులో కూరగాయల ధరలు (కిలోకు రూ.లలో)

వంకాయలు	40	గోరు చిక్కుడు	40	మునగ కాయలు	70
టమాట	30	బీన్స్	60	కాకర కాయలు	40
దోసకాయ	30	బెండ కాయలు	40	కొత్తిమీర (కట్ట)	100
ఉల్లిపాయలు	70	దొండ కాయలు	40		
వెల్లుల్లి	360	కాలీఫ్లవర్	40		
అల్లం	60	క్యాబేజీ	40		
పచ్చి మిర్చి	30	క్యారెట్	60		
క్యాప్సికం	60	బీట్ రూట్	60		
బీర కాయలు	50	బంగాళా దుంపలు	50		
చిక్కుడు	60	అనప కాయలు	50		



భయం వేస్తోంది



ఇంతలా కూరగాయల ధరలు పెరగడం ఎప్పుడూ చూడలేదు. మార్కెట్‌కు వెళ్లాలంటే భయం వేస్తోంది. అల్లం, వెల్లుల్లి వంటివి కొనలేకపోతున్నాం. వాటి ధరలు ఊహించనంతగా పెరిగాయి. ఏ కూరగాయ ధర చూసుకున్నా అందుబాటులో లేదు. చాలా రకాల కూరగాయల ధరలు నాన్‌వెజ్‌తో సమానంగా పెరిగిపోయాయి. ఇలా అయితే పేద, మధ్య తరగతి ప్రజలు ఎలా బతకాలి. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– బుడగ ఓబులమ్మ, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

ధరలు తగ్గిస్తే మేలు..



గతంలో రెండు వందలు తీసుకుని బజారుకు తీసుకెళ్తే సంచి నిండిపోయేది. ఇప్పుడూ రూ.500 తీసుకెళ్లినా సగం సంచి కూడా నిండడం లేదు. కేవలం ఉల్లిపాయలు, టమాటలు మాత్రమే వస్తున్నాయి. ఏ కూరగాయ చూసినా రూ.50కి తక్కువ లేదు. పచ్చి మిర్చి ధర కూడా పెరిగిపోయింది. మాలాంటి సామాన్యులు కూరగాయలు కొనలేకపోతున్నాం. ప్రభుత్వం ధరలు తగ్గించి, కూరగాయలు సరఫరా చేయాలి.

– పెద్ద లింగమయ్య, గంగలకుంట, రాప్తాడు మండలం

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సైబర్ పోలీసు ప్రతినిధి హరి

అనంతపురం ఎడ్యుకేషన్: సోషల్ మీడియా, సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల బోటనీ విభాగంలో విభాగాధిపతి శ్రీదేవి, అధ్యాపకురాలు విష్ణుప్రియ అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ పోలీసు ప్రతినిధి హరి మాట్లాడుతూ.. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతున్నారన్నారు. అందులో అసభ్యకరమైన పోస్టులు పెడుతూ జీవితాల్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా అసాంఘిక శక్తులు యువతను పక్క దారి పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వాటిపై యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో తెలియని వారికి వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదని పేర్కొన్నారు. ఫొటోలను ప్రొఫైల్‌గా పెట్టుకోవద్దని తెలిపారు. సామాజిక బాధ్యత, సామాజిక స్పృహ కలిగి ఉండి ప్రతి ఒక్కరూ ఇంకొకరికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హరి, పుష్ప, మెర్సీ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ కొండప్ప పాల్గొన్నారు.

సారోళ్లు ఎక్కడికి వెళ్లారో?



మధ్యాహ్నం 12 గంటల సమయంలో మరూరు గ్రామ సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు రోజూ విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అయితే మండలంలోని మరూరు సచివాలయ సిబ్బంది శనివారం విధులకు హాజరయ్యారో లేదో కూడా తెలియడం లేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సచివాలయంలో ఒక్క అధికారి కూడా కనిపించలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సచివాలయానికి తాళం వేసి ఉండటాన్ని గమనించి ఈ రోజే సెలవేమో అనుకుని ఇంటికి వెళ్లారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో కూడా సిబ్బంది ఎక్కడా అందుబాటులో లేరు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల పంపిణీని సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో బిజీ అయిపోయారు. కొందరు ఉద్యోగులు ఉదయమే పింఛన్లు పంపిణీ చేసి కార్యాలయాలకు వెళ్లకుండా ఇళ్లకు వెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మిని సంప్రదించగా.. మండల వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులందరూ పింఛన్ల పంపిణీకి వెళ్లినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ఉండటంతో అక్కడికి కొంత మంది అధికారులు వెళ్లడంతో పింఛన్ల పంపిణీకి స్టాఫ్ తక్కువ రావడం జరిగిందన్నారు. దీంతో సచివాలయాల సిబ్బందిని పింఛన్ల పంపిణీకి వాడుకోవడం జరిగిందని తెలిపారు.

ట్యాంక్ మెటీరియల్‌ను ల్యాబ్‌కు పంపిస్తాం

సాక్షి ఎఫెక్ట్..



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరులోని ఎస్సీ కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం సాక్షి దినపత్రికలో 'పట్టించుకోకపోతే ప్రాణాపాయమే' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఈఓఆర్డీ కామాక్షి తదితరులు వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ ద్వారా తీర్మానం తీసుకుని ప్రస్తుతం ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి కొంచెం ఐరన్, కాంక్రీట్‌ను జేఎన్‌టీయూ ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. ల్యాబ్ నుంచి నివేదికలను బట్టి వాటర్ ట్యాంక్ కూల్చి నిర్మించాలా? లేదా మరమ్మతులు చేయాలా అని నిర్ణయిస్తామని వెల్లడించారు. కాగా.. ఈ ట్యాంక్‌ను 30 సంవత్సరాల క్రితం నిర్మించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైనది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైనదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. స్థానిక పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు టి. వెంకటేష్ ప్రసాద్ శనివారం రిటైర్డ్ కావడంతో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు ఉపాధ్యాయ చేతుల్లో ఉందన్నారు. విద్యార్థులను నైతిక విలువలు పెంపొందించే దిశగా పని చేయాలని కోరారు. మాజీ మేయర్ స్వరూప, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రరెడ్డి, కార్పొరేటర్ శాంతి సుధ తదితరులు టీచర్ వెంకటేష్ ప్రసాద్ సేవలను కొనియాడారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుష్మలత, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, నాయకులు అమరా చంద్రబాబు, సురేష్ బాబు, గోపీచంద్, హర్షవర్దన్, పీఎస్సీ నాయుడు, నరహరి పాల్గొన్నారు.

ప్రాణాలు పోయినా పట్టించుకోరా?

అనంతపురం టవర్‌క్లాక్: 'కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరుగుతోంది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులు సీఎంను కలిసేందుకు కూడా అనుమతి ఇవ్వలేదు. దళితుల ప్రాణాలు పోయినా పట్టించుకోరా' అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందితే ఆ కుటుంబాలకు కేవలం రూ.5 లక్షల చొప్పున ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలు సీఎంను కలవాలని అనుమతులు కోరితే.. అనుమతించకుండా దళితులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తక్షణం బాధిత కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఈశ్వరయ్య, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సంజీవప్ప, రామకృష్ణ, నరేంద్ర, ఆది పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్‌లో ఆన్‌లైన్ సేవలు

అనంతపురం అగ్రికల్చర్: ఖాతాదారుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ది అనంతపురం అర్బన్ కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో శనివారం ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభించారు. కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ సదుపాయం కల్పిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ పోటీ ప్రపంచంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లకు దీటుగా టౌన్ బ్యాంకులో కూడా ఆధునిక ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. త్వరలోనే సీటీఎస్ చెక్‌బుక్, ఏటీఎం సేవలను కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. టౌన్ బ్యాంక్ సేవలను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ విజయ భాస్కర్, యాక్సిస్ బ్యాంక్ ఏపీ సర్కిల్ హెడ్ జే.రవీంద్ర నాథ్, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మ దేవాలయంలో అన్నదానం

అనంతపురం కల్చరల్: కార్తీక మాసం ముగింపు సందర్భంగా స్థానిక ఉమానగర్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయల కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ మేయర్ రాగే పరుశురామ్‌తో పాటూ పలువురు పెద్దలు ఆత్మీయ అతిథులుగా హాజరవుతారన్నారు. భక్తులందరూ ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

నేడు సంగీత సాగర సమ్మేళనం

అనంతపురం కల్చరల్: నగరంలోని త్యాగరాజ సంగీత సభలో ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు సంగీత సాగర సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సభ ప్రతినిధి జ్ఞానేశ్వర రావు ఉత్తార్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాయనీమణులు ఆలపించే గీతాలను ఆస్వాదించాలని కళాభిమానులకు విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగా హారతి



మంజునాథ స్వామిని ఊరేగిస్తున్న శివస్వాములు



శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: కార్తీక అమావాస్యను పురస్కరించుకుని శనివారం గంగా హారతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవస్థానంలో శివస్వాములు ఇతర మాలధారణ చేసిన స్వాములు భజనలు, భక్తిగీతాలతో పరమేశ్వరుడికి నీరాజనాలర్పించారు. ఆలయ వ్యవస్థాపకుడు బసవరాజ స్వామి ఆధ్వర్యంలో హెచ్చెల్సీ కెనాల్‌లో భక్తులందరూ సామూహికంగా వెలిగించిన గంగా హారతితో పరిసరాలు దేదీప్యమానమయ్యాయి. అంతకుముందు మంజునాథుడికి భస్మలింగార్చన, అష్టోత్తర పుష్పార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. తీర్థ ప్రసాదాలనంతరం దీక్షలు చేస్తున్న వారందరికీ ఆలయ ప్రతినిధులు భిక్ష ఏర్పాటు చేశారు.

శరణమయ్యా.. మణికంఠా



భక్తిగీతాలు ఆలపిస్తున్న అయ్యప్ప మాలధారులు

రాప్తాడు: మండల కేంద్రంలో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు ఎం.కేశవయ్య, ఎల్ఐసీ వెంకటరాముడు, కుమ్మర రాము, చెన్నయ్య, కదిరెస్ నేతృత్వంలో అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన అయ్యప్ప ప్రతిమను రథంపై కొలువుదీర్చారు. స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి బ్యాండు మేళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. అయ్యప్ప స్వామి మాలధారులు భక్తిగీతాలు ఆలపిస్తూ రథాన్ని ముందుకు లాగారు. శరణమయ్యా.. మణికంఠా అంటూ భక్తులు అయ్యప్ప స్వామిని వేడుకున్నారు. అనంతరం శివాలయం వద్ద ప్రసాదం పంపిణీ చేశారు. అంతకుముందు కన్నెస్వాములు కలశాలు చేపట్టి ఊరేగింపులో పాల్గొన్నారు.

22న రాష్ట్రస్థాయి సున్నీ ఇస్తెమా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మైనార్టీ నాయకులు

అనంతపురం కల్చరల్: స్థానిక జూనియర్ కాలేజ్ మైదానంలో ఈనెల 22న రాష్ట్రస్థాయి సున్నీ ఇస్తెమా నిర్వహిస్తున్నట్లు తెహరిక్ అధ్యక్షుడు హజ న్‌రజా, ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్‌షఫీ తెలిపారు. రెండవ రోడ్డులోని 'మస్జిద్ ఏ బహువుద్దీన్' ప్రాంగణంలో శనివారం తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారూక్ వారి 15వ రాష్ట్రస్థాయి సున్నీ ఇస్తెమా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్ నుంచి సయ్యద్ అమీర్ మసూది సాహెబ్, మధ్యప్రదేశ్ నుంచి అబ్దుల్ ఖాదిర్ తదితరులు ఇస్తెమాకు ముఖ్య అతిథులుగా హాజరై ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు. ఇదే ప్రదేశంలో మహ్మద్ ప్రవక్త పవిత్ర కేశాలు, ఆయన వాడిన వస్తువులు, ధరించిన దుస్తుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే వారికి అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముతవల్లి ఫరీదుద్దీన్, పర్వీష్, షబ్బీర్ అహ్మద్, అబ్దుల్ సమీ పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

అనంతపురం క్రైం: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ అధికారులు ఒక రోజు ముందుగానే చేపట్టారు. సచివాలయాలకు ముందస్తుగా ఖాతాలలో నగదు జమ చేసిన అధికారులు.. మొదటి రోజే వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య ఆదేశాలు చేశారు. శనివారం సచివాలయం సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. కాగా పింఛన్ల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమం అనే విషయాన్ని మరచిన అధికార పార్టీ నేతలు ప్రతి నెల సచివాలయ సిబ్బంది విధులకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. వారికి ఇష్టం వచ్చిన వారికి ముందుగా పింఛన్ ఇప్పిస్తూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

94 శాతం పూర్తి

అనంతపురం జిల్లాలో 2,81,637 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. వీరికి రూ.123,88,75,500 పింఛన్ సొమ్ము పంపిణీ చేయాల్సి ఉంది. సచివాలయ సిబ్బంది 2,67,273 మందికి మొదటి రోజే రూ.117,43,49,500 పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మొత్తంగా 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య వెల్లడించారు. లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ర్యాలీ

అనంతపురం మెడికల్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు. ర్యాలీలో ఉన్నతాధికారులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొంటారన్నారు.